

షాపూర్‌నగర్‌కు చెందిన కూన రవీందర్‌గౌడ్, సులోచనల ఇంట్లో మంగళవారం బ్రహ్మక మలం వికసించింది. దీంతో చుట్టు పక్కల ఇళ్ల ప్రజలు బ్రహ్మ కమలాన్ని చేసేం దుకు క్యూ కట్టారు. రెండేళ్ల క్రితం బ్రహ్మకమలం మొక్కను నాటగా 3 పూలు వికసించడంతో వారు ప్రత్యేక పూజలు చేశారు.
– కుత్బుల్లాపూర్

రెండేళ్ల క్రితం నాటితే.. 3 పుష్పాలు

బ్రహ్మ కమలం

వెల్లివిరిసిన ఆనందం

హిమాలయ ప్రాంతంలో వికసించే దివ్య పుష్పం బ్రహ్మ కమలం. ఈ పుష్పాలు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 27 పుష్పాలు వికసించాయి. రెండు రోజులుగా వీటి సంఖ్య పెరుగుతూ వస్తోంది. శంషీగూడ దాక్షాయణి గ్రీన్ విస్తాస్ అపార్టుమెంట్‌లో సురేందర్ నాయక్, పూనంనాయక్ దంపతుల నివాసంలో బ్రహ్మ కమలం పుష్పాలు వికసించాయి. దీంతో అపార్టుమెంట్‌వాసులు ఈ పుష్పాలను తిలకించేందుకు ఆసక్తి కనబరిచారు. సువా సన వెదజల్లే ఈ బ్రహ్మ కమలం పుష్పాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఐదేళ్ల క్రితం హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో రెండు మొక్కలను కొనుగోలు చేసి పెంచుకున్నారు. ఈ ఏడాది ఏకంగా 27 పుష్పాలు వికసించటంతో వారి సంతోషానికి అంతే లేకుండా పోయింది.
– భాగ్యనగర్‌కాలనీ



గాజులరామారం డివిజన్ రావినారాయణరెడ్డినగర్ ఫేజ్–3లో నివాసముండే మహా నాగరాజు నివాసంలో బ్రహ్మ కమలాలు వికసించాయి. ఐదేళ్ల క్రితం గుజరాత్‌లోని సూరత్ నుంచి మొక్కను తీసుకువచ్చి నాటారు. సంవత్సరం క్రితం ఒక బ్రహ్మ కమలం పూసింది. మంగళవారం ఏకంగా 6 బ్రహ్మ కమలాలు వికసించడంతో వారి ఇంట్లో ఆనందం వెల్లివిరిసింది.
– సుభాష్‌నగర్



నాగరాజు ఇంట్లో వికసించిన బ్రహ్మ కమలాలు

ఐదేళ్ల క్రితం నాటితే.. 6 పుష్పాలు

లక్ష ఆర్థిక సాయం ఎక్కడ.?

- కుత్బుల్లాపూర్ లో ప్రారంభం కాని పంపిణీ
- ఈనెల 15న ప్రారంభం చేసిన ప్రభుత్వం
- 4617 మంది దరఖాస్తుదారుల్లో టెన్షన్
- మొక్కుబడి విచారణపై విమర్శలు



ఆదాయ ధ్రువీకరణ పత్రాలకోసం దరఖాస్తు చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద క్యూ కట్టిన బీసీ కులవృత్తుదారులు (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఆర్థిక సాయం ఎక్కడ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆర్భాటంగా ప్రవేశపెట్టిన బీసీ కులవృత్తుదారులకు ఆర్థిక సాయం పంపిణీ పథకం ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా మారింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 4617 దరఖాస్తులు రాగా జూన్ 25 తేదీ నుంచి వారం రోజులపాటు ఇంటింటికీ తిరిగి విచారణ చేపట్టారు. కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిల్ పరిధిలో మొత్తం 3353 దరఖాస్తులు, నిజాంపేట కార్పొరేషన్ లో 359, కొంపల్లి మున్సిపాలిటీలో 176 దుండిగల్ మున్సిపాలిటీలో 729 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించిన అధికారుల బృందం పూర్తి నివేదికను ఉన్నత అధికారులకు అందజేశారు. అంతవరకు బాగానే ఉంది.

◆ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఈనెల 15వ తేదీన శాసన సభ్యుల చేతుల మీదుగా ఆర్థిక సహాయం కోసం ఎంపిక చేసిన వారికి చెక్కులు అందజేసే ఏర్పాట్లు చేసింది. అయితే కుత్బుల్లాపూర్ లో ఈ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పి చివరగా విడతల వారీగా అంటూ ప్రచారం చేయడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఒకవైపు దళిత బంధు పేరిట రూ.10లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పటికే అభాసుపాలైన ప్రభుత్వం తాజాగా కులవృత్తుదారులకు ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించి అమలుపరచకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొక్కుబడిగా విచారణ చేపట్టి...

బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సహాయం కింద కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 4617 దరఖాస్తులు వచ్చాయి. వీటిని సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తుది జాబితాను కలెక్టర్కు అందజేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సైతం రూ.400 కోట్ల నిధులను విడుదల చేసింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 335 మంది లబ్ధిదారులను గుర్తించి మొదటి విడతలో అందజేయాలని ఆదేశించింది. కుత్బుల్లాపూర్‌లో మాత్రం పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఒకేసారి వీరికి పంపిణీ చేయకుండా విడతల వారీగా పంపిణీ చేస్తామని చెప్పడంతో లబ్ధిదారులు మాకు వస్తాయా..! రావా..!! అన్న మీ మాంసంలో పడ్డారు.

◆ విచారణ చేపట్టే సమయంలో కొంతమంది సిబ్బంది చెట్ల కింద, కార్యాలయాల్లో కూర్చుని దరఖాస్తులు పరిశీలించి మొక్కుబడిగా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు అన్న విమర్శ కూడా ఉంది.. దీనిపై అధికారులు క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాకుండా అత్యధికం అనర్హులే అన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అధికారులు పరిశీలించిన జాబితాలో మెజార్టీ అర్జిదారులు కులవృత్తులపైనే ఆధారపడకుండా ఇతరత్రా పనులు చేపడుతూ వస్తున్నారని, అంతేకాకుండా ఆర్థికంగా బాగా ఉన్నవాళ్లు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడంతో అర్హులకు నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి ఈ పథకం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



దొడ్డు బియ్యం ఇదెక్కడి ఘోరం!

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్
- కుత్బుల్లాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ సందర్శన
- బడిలో మౌలిక వసతులు లేవంటూ ఆగ్రహం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్.

కుత్బుల్లాపూర్: సొంత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పట్టించుకోని ఎమ్మెల్యే ఇక నియోజకవర్గాన్ని ఏమి ఉద్ధరిస్తాడని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన కుత్బుల్లాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.

◆ అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. పాఠశాలలోని తరగతి గదులతో పాటు, మరుగుదొడ్లు, చిన్నపాటి వర్షానికే జలమయం అవుతున్నాయని అన్నారు. సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉందన్నారు. సన్న బియ్యం అందిస్తున్నామని గొప్పలు చెబుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం దొడ్డు బియ్యంతోనే సరిపెడుతోందని ఆరోపించారు.

◆ ఒకే గదిలో పలు తరగతులను నిర్వహించడంతో విద్యార్థులు అయోమయంగా ఉన్నారన్నారు. కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలకు రూ.కోటి నిధులు ఇస్తానని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే వివేకానంద్ అబద్ధమాడారన్నారు. సొంత ఊళ్లోని పాఠశాల స్థితిగతులను మార్చలేని వ్యక్తి ఇక నియోజకవర్గ ప్రజలకు ఏమి చేస్తాడని ప్రశ్నించారు. ఎనిమిదేళ్లుగా విద్యార్థులకు వెచ్చించిన తన జీతభత్యాలపై ఎమ్మెల్యే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

◆ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు నటరాజ్ గౌడ్, నల్ల జయశంకర్ గౌడ్, నర్సింగరావు, శ్రీధర్ వర్మ, మురళీకృష్ణ, అలవేలు, అరుణ్, మనీష్, వీరబాబు, పులి సందీప్, ప్రవీణ్ చారి తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్..

సుభాష్‌నగర్: గ్రామీణ ప్రాంతాలు, బస్తీల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలకు వైద్యుల మాదిరిగా గుర్తింపు కల్పించాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, ఉపాధ్యక్షులు బలలింగం, ప్రధాన కార్యదర్శి ఖాజా అన్నారు. మంగళవారం సూరారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ ఆర్‌ఎంపీ, పీఎంపీలతో తాము ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. 2015 సంవత్సరం నుంచి వైద్య వృత్తిలో ఉన్న వారికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సర్టిఫికెట్లు జారీ చేస్తే సమస్య ఉత్పన్నం కాదన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేద ప్రజలకు ఆర్‌ఎంపీ, పీఎంపీలు తక్కువ ఫీజుతో వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలో వందలాది మంది ప్రాణాలు కాపాడామని తెలిపారు. ఐఎంఏ ఇప్పటికైనా తమపై కక్ష సాధింపు ధోరణి వీడి తమకు గుర్తింపు ఇవ్వాలని కోరారు.

'జేఎఫ్ ఇండియా'తో వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి ఎంఓయూ



జేఎఫ్ ఇండియా ఎండీతో ఒప్పందం చేసుకుంటున్న వీజేఐఈటీ ప్రిన్సిపాల్

నిజాంపేట్: బాచుపల్లికి చెందిన వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీజేఐఈటీ) కళాశాల యాజమాన్యం ప్రముఖ ఆటోమోటివ్ సంస్థ జేఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జేఎఫ్ ఇండియా ఎండీ జంబునాథ్ కృష్ణస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సీడీ నాయుడు మాట్లాడుతూ.. ఈ ఎంఓయూలో భాగంగా విద్యార్థులకు, అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. దీంతో విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు పొందే అస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చెన్న కేశవరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణవానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్థానిక సమస్యలను పరిష్కరించాలి

దుండిగల్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని బీఆర్‌ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు మంగళవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేయగా వెంటనే స్పందించిన ఆయన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు డెంటల్ చెకప్



విద్యార్థులకు డెంటల్ చెకప్ చేస్తున్న మల్లారెడ్డి ఆస్పత్రి వైద్య సిబ్బంది

నిజాంపేట్: ప్రగతినగర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సూరారం మల్లారెడ్డి హాస్పిటల్ డెంటల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డెంటల్ చెకప్ నిర్వహించారు. ఆస్పత్రి హెచ్ఓడీ పరప్ప సజ్జనార్ నేతృత్వంలో 300 మంది విద్యార్థులకు ఆస్పత్రి వైద్య సిబ్బంది డెంటల్ చెకప్‌లు చేసి తగు సూచనలు చేశారు. ఈ వైద్య శిబిరంలో జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ట్రెజరర్, వరప్రసాద్, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆశాలత, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, దినకర్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బొడ్రాయి పూజ

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం బుధవారం జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు అమ్మవారికి గణపతి పూజ, అర్చన, అభిషేకం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని కట్ట మైసమ్మ ఆలయంలో మంగళవారం రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అర్చనల్లో పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి, శైలజ రెడ్డి దంపతులు పూజలో పాల్గొని అభిషేకం నిర్వహించారు. ప్రతి మంగళవారం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కోరిన కోర్కెలు తీరడంతో భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారని ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి పేర్కొన్నారు.

డిప్యూటీ కమిషనర్ల బదిలీలు

జగద్గిరిగుట్ట: గ్రేటర్ హైదరాబాద్‌లో డిప్యూటీ కమిషనర్లు బదిలీ అయ్యారు. గాజులరామారం సర్కిల్ చెందిన ప్రశాంతి జూబ్లీహిల్స్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. శేరిలింగంపల్లి జాయింట్ కమిషనర్ మల్లయ్య గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన మంగతయారు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా నార్సింగి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సత్యబాబు కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు గ్రేటర్ కమిషనర్ రొనాల్డ్ రోస్ ఉత్తర్వులు జారీ చేశారు.

డీప్‌రూట్ స్కూల్‌లో బోనాలు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ విమానాపురి కాలనీలోని డీప్ రూట్ స్కూల్‌లో మంగళవారం బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల పోతరాజు వేషధారణలో చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లులు బోనాలతో స్కూల్‌కు తరలివచ్చిన అమ్మవారికి సమర్పించారు. ప్రిన్సిపాల్ ఛాయాదేవి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.



వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం



దండమూడి ఎన్‌క్లేవ్‌లో పైపులైన్‌ను పరిశీలిస్తున్న జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి, అధికారులు

చింతల్: డివిజన్‌లో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి అక్కడక్కడ వర్షపు నీరు నిలుస్తోంది. జీడిమెట్ల సెక్షన్ పరిధిలోని దండమూడి ఎన్‌క్లేవ్‌లో వర్షం నీటి ప్రవాహం రోడ్డుపై అధికంగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఆయా ప్రాంతాలను మంగళవారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి, సెక్షన్ మేనేజర్ రాజు ఆయా ప్రాంతాలలో పర్యటించారు. వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

◆ అదే విధంగా సుభాష్ నగర్ పైప్ లైన్ రోడ్డులో శ్వేత ఆర్యన్ హంసఫర్ వద్ద పాత భూగర్భ డ్రైనేజీ పైపులైన్, తాగునీటి పైప్‌లైన్లు కొంతమేర దెబ్బతిన్నాయి. నూతన పైప్‌లైన్ వేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జగద్గిరిగుట్ట సబ్ డివిజన్, షాపూర్ నగర్ సబ్ డివిజన్లలో వరద నీటిముప్పు ఉన్న ప్రాంతాలను డీజీఎంలు, సెక్షన్ మేనేజర్లతో శ్రీధర్‌రెడ్డి పర్యటించి రోడ్లపై చేరిన నీటిని తరలించే ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు.

అన్నదానం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ రుక్మిణీ ఎస్టేట్స్‌లోని గోల పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త ముద్దాపురం ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్దాపురం సాయి గౌడ్, రమేష్ గౌడ్ , పోచమ్మ ఆలయం కార్యవర్గ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



రుక్మిణీ ఎస్టేట్స్‌లోని పోచమ్మ ఆలయంలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

వర్షం వచ్చే.. గిరాకీ పాయె!



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురుతో చిరు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జగద్గిరిగుట్ట బస్టాప్‌లో తెల్లవారుజాము నుంచే చిరువ్యాపారులు పూలు విక్రయిస్తుంటారు. ముసురు కారణంగా మంగళవారం గిరాకీ లేక ఓ పూల కొట్టు వెలవెలబోయింది. – జగద్గిరిగుట్ట

ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం చూపాలి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి వినతులు అందజేసిన ప్రజలు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున శంభీపూర్‌లోని ఆయన కార్యాలయానికి తరలి వచ్చి సమస్యలపై వినతులు సమర్పించారు. వీటిపై స్పందించి ఎమ్మెల్సీ సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి పరిష్కార మార్గాలు చూపించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. మల్లంపేట ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి విషయంపై ఎమ్మెల్సీ రాజుతో చర్చించారు.

◆ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.5.81 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను మంగళవారం 13 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్సీ అందజేశారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

ఎమ్మెల్సీ రాజుతో ఎమ్మెల్యే గూడెం భేటీ...



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజుతో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. రాజకీయ విషయాలపై ఏమైనా చర్చించారా..! అన్న విషయాన్ని గోప్యంగా ఉంచారు. పటాన్‌చెరువు నియోజకవర్గం నుంచి నీలం మధు పేరు కూడా ప్రముఖంగా ఎమ్మెల్యే టికెట్ ఇస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సన్నిహితంగా ఉండే ఎమ్మెల్సీతో భేటీ కావడంపై చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీ కార్యాలయ వర్గా సమాచారం మాత్రం సాధారణ భేటీ అని అందులో రాజకీయాలు ఏమీ లేవని కొట్టిపారేశారు.

21న శాంతిసరోవర్‌లో 'యూత్ మోటివేషన్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ యూత్ వింగ్ ఆధ్వర్యంలో యూత్ మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలిలోని శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో 'సక్సెస్ మంత్రా' పేరిట శుక్ర వారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్ ఈవి గిరీష్, బ్రహ్మకుమారీస్ డైరెక్టర్ కుల్‌దీప్ దీదీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు 040 23001234లో సంప్రదించాలి.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో మంగళవారం ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతుడి వయసు 50ఏళ్లు ఉంటాయని, నేవీ బ్లూ షర్ట్, ప్యాంట్, షూస్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే 8712663246/ 9490617229లో తెలియజేయాలని కోరారు.